నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
10 | నిజామాబాద్ శనివారం 11 మే 2024 | ADILABAD NIRMAL

అసత్య ప్రచారాలు నమ్మొద్దు

- నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల

మాట్లాడుతున్న నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల

భైంసా, మే, 10 : భైంసాలాంటి సున్నితమైన ప్రాంతంలో రెచ్చగొట్టే ఎలాంటి అసత్య ప్రచారాలను నమ్మవద్దని నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల సూచించారు. శుక్రవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ భైంసా పట్టణం శాంతియుతంగా ఉందని తెలిపారు. గురువారం సాయంత్రం జరిగిన కేటీఆర్ రోడ్ షోలో హనుమాన్ భక్తుల ఆందోళన, కేటీఆర్ వాహనంపై దాడి కేసులో ఇప్పటికే 23 మందిని అదుపులోకి తీసుకున్నామని ఆమె తెలిపారు. ఎవరైనా ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పుకార్లను నమ్మకుండా సంయమనం పాటించాలన్నారు. ఎస్పీ వెంట పట్టణ సీఐ రాజారెడ్డి తదితరులు ఉన్నారు.

ఎన్నికల విధులను బాధ్యతగా నిర్వర్తించాలి

-ఎస్పీ గౌష్ ఆలం

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, మే 10 : ఈ నెల 13న నిర్వహించే పోలింగ్ సందర్భంగా బందోబస్తు నిర్వహణ, ఈవీఎంల భద్రత పోలీసుల బాధ్యతగా నిర్వర్తించాలని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల విధులను నిర్వహించనున్న నూతన శిక్షణ కానిస్టేబుల్, కేంద్ర బలగాలకు శుక్రవారం ఎస్పీ గౌష్ ఆలం పోలీస్ శిక్షణ కేంద్రంలో అవగాహన కల్పించారు. ఎన్నికల నిర్వహణ, జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 87 రూట్లలో చేయాల్సిన విధులు, మొబైల్ పార్టీలు, పోలింగ్ సమయంపై వివిధ అంశాలపై వివరించారు. పోలింగ్ స్టేషన్ల వద్ద 100 మీటర్ల పరిధిలో ప్రజలు గుంపులు గుంపులుగా చర్యలు, తీసుకోవాలని, ఓటర్లు క్యూ పద్ధతి పాటించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు సీ సమైజాన్‌రావు, బీ సురేంద్రరావు, డీఎస్పీలు బీ ప్రకాశ్, ఎల్ జీవన్‌రెడ్డి, పోతారం శ్రీనివాస్, సీఐ కే సత్యనారాయణ సిబ్బంది ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జాన్సన్ నాయక్

కేటీఆర్‌పై దాడి హేయమైన చర్య

బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్

ఖానాపూర్ టౌన్, మే 10 : ముథోల్ నియోజకవర్గంలో గురువారం నిర్వహించిన రోడ్ షోలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ అన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో ఏ పార్టీ అయినా ఎక్కడైనా స్వేచ్ఛగా ప్రచారం చేసుకునే హక్కు ఉందన్నారు. విమర్శలకు దీటుగా సమాధానం చెప్పాలి కానీ భౌతిక దాడులకు దిగడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాళ్లపల్లి రాజగంగన్న, పట్టణ అధ్యక్షుడు గౌరికర్ రాజు, మాజీ జడ్పీటీసీ రామునాయక్, కల్వకుంట్ల నారాయణ, అబ్దుల్ ఖలీల్, కొక్కుల ప్రదీప్, బీసీ రాజన్న, కారింగుల సుమన్, పుప్పాల గజేందర్, కోమటినల్లి మధు, చింటు తదితరులున్నారు.

బీఆర్ఎస్‌లో జోష్

భైంసా, నిర్మల్‌లో కేటీఆర్ రోడ్ షోలు సూపర్ సక్సెస్

- వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసంగంతో శ్రేణుల్లో ఫుల్ ఖుష్
- అడుగడుగునా బ్రహ్మరథం పట్టిన ప్రజలు
- కేసీఆర్ పాలనలో చేపట్టిన ప్రగతిని వివరిస్తూనే కాంగ్రెస్, బీజేపీ వైఫల్యాలను ఎండగట్టిన రామన్న
- కారు గెలుపు ఖాయమైందంటున్న రాజకీయ విశ్లేషకులు
- ప్రతిపక్ష పార్టీల్లో ఆందోళన

నిర్మల్, మే 10(నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం భైంసా, నిర్మల్‌లో నిర్వహించిన రోడ్‌షోలు సూపర్ సక్సెస్ కాగా, నాయకులు, కార్యకర్తల్లో జోష్ పెరిగింది. ప్రజలు అడుగడుగునా నీరాజనం పలుకగా, శ్రేణుల్లో గెలుపు ఖుష్ కనిపిస్తున్నది. ఎక్కడ చూసినా కేటీఆర్ ప్రసంగం గురించే చర్చ నడుస్తున్నది. ఆయా చోట్ల జన సంద్రాన్ని చూసి.. ఆదిలాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపు ఖాయమైందన్న అభిప్రాయం ఆయా వర్గాల్లో వ్యక్తమవుతున్నది. భైంసాలో కేటీఆర్ రోడ్‌షో నిర్వహించే సమయంలో కొంతమంది పథకం ప్రకారం భగ్నం చేయాలని ప్రయత్నించి విఫలమయ్యారు. రాజకీయ దురుద్దేశంతో కుట్రలు చేస్తే సహించబోమని, బెదిరింపులకు భయపడేది లేదని కేటీఆర్ సభా వేదికపై నుంచి ప్రకటించడంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళనకారులను అడ్డుకునే యత్నం చేశారు. పోలీసులు జోక్యం చేసుకొని నిరసనకారులపై లాఠీలు ఝుళిపించి. కేసులు నమోదు చేసి జైలుకు తరలించారు. బీఆర్ఎస్ పార్టీ శాంతియుతంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా.. బీజేపీ అనుబంధ సంఘాల సభ్యులు కొందరు ఉద్దేశపూర్వకంగా సభను గందరగోళ పరిచేందుకు ప్రయత్నించడం సమంజసం కాదని ప్రజలు మండిపడుతున్నారు. అదే రోజు సాయంత్రం నిర్మల్‌లో జరిగిన రోడ్‌షోకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. స్వచ్ఛందంగా తరలివచ్చి కేటీఆర్ ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. కేసీఆర్ పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై వివరిస్తూనే బీజేపీ, కాంగ్రెస్‌లపై వైఫల్యాలను ఎండట్టారు. ఈ రెండు పార్టీలు ప్రజలకు చేసిందేమీ లేదని, కేవలం ఆర్భాటపు ప్రచారాలు, అధికార కాంక్షతోనే జనాన్ని మోసం చేస్తున్నాయంటూ ధ్వజమెత్తారు. ఆపై మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిపై ఘాటుగా విమర్శలు చేసి ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. పదేళ్ల పాటు ఇంద్రకరణ్‌రెడ్డికి మంత్రి పదవి అప్పగిస్తే ఆయన వెన్నుపోటు పొడిచి పార్టీని వీడడం సమంజసమా..? అంటూ సభకు హాజరైన జనాన్ని ప్రశ్నించారు. దీంతో జనం పెద్ద ఎత్తున స్పందించి కాదు.. కాదు.. అంటూ నినాదాలు చేశారు. ఇలాంటి మోసగాళ్ల మాటలు మళ్లీ నమ్మవద్దంటూ ఆయన సూచించారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓట్లడిగే నైతిక హక్కు లేదంటూ కేటీఆర్ మండిపడ్డారు. నిర్మల్ కార్నర్ మీటింగ్‌లో దాదాపు అరగంట పాటు కేటీఆర్ ప్రసంగం సాగగా, పెద్ద సంఖ్యలో హాజరైన జనం కదలకుండా ఆసక్తిగా వినడం, మధ్యలో హర్షాతిరేకాలు వ్యక్తం చేయడం కనిపించింది. కేటీఆర్ ఓ వైపు ఎదురు దాడిని కొనసాగిస్తూనే బీఆర్ఎస్ గెలుపు ఆవశ్యకతను వివరించి జనాన్ని విశేషంగా ఆకట్టుకున్నారు. మొత్తానికి కేటీఆర్ జరిపిన పర్యటనతో కారు గెలుపు ఖాయమైనట్లు తెలుస్తుండగా, కాంగ్రెస్, బీజేపీ శ్రేణుల్లో ఆందోళన కనిపిస్తున్నదని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

నిర్మల్ జిల్లాకేంద్రంలోని మంచిర్యాల చౌరస్తాలో నిర్వహించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షోలో పాల్గొన్న జనసందోహం

భైంసాలో నిర్వహించిన రోడ్ షోలో అభివాదంచేస్తున్న కేటీఆర్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి సక్కు

పోలింగ్‌కు సిద్ధంగా ఉండాలి

- నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలి
- అధికారులతో కలెక్టర్ రాజర్షి షా

టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, మే 10: పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి రాజర్షి షా ఆదేశించారు. పోలింగ్ కోసం ఏర్పాట్లు , 48 గంటల సైలెన్స్ పిరియడ్, రోల్ ఆఫ్ సెక్టోరల్ అధికారుల విధులపై శుక్రవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు చేశారు. 48 గంటల పాటు సైలెన్స్ పిరియడ్ నార్నూర్, గాదిగూడలో శనివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి మొదలవుతుందన్నారు. మిగతా జిల్లాల్లో సాయంత్రం 6 గంటలకు సైలెన్స్ పిరియడ్ మొదలవుతుందని తెలిపారు. 13న పోలింగ్ ముగిసే వరకు కొనసాగుతుందని తెలిపారు. 144 సెక్షన్‌ను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఐదుగురు కంటే ఎక్కువ మంది సమూహంగా ప్రచారం చేస్తే పంచాయతీ సెక్రటరీలు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు వెంటనే స్పందించి వెంటనే ఆ ప్రచారాన్ని నిలిపివేయాలన్నారు. పోలింగ్‌స్టేషన్‌కి ముందు 100 మీటర్ల దూరంలో వైట్ లైన్స్ వేయాలన్నారు. అథారిటీ లెటర్ ఉంటేనే మీడియా వారిని అనుమతించాలన్నారు. ఏజెంట్ ఒక వెహికిల్‌కే అనుమతి ఉంటుందన్నారు. ఎలాంటి రాజకీయ ప్రచారం, పాదయాత్రలు జరగకుండా చూడాలని, ప్రచార సామగ్రి సీజ్ చేయాలని, మద్యం దుకాణాలు మూసివేయాలన్నారు. ఈవీఎంల బాధ్యత సెక్టర్ ఆఫీసర్లదేనన్నారు. పోలింగ్ క్లోజ్ అయిన తర్వాత క్లోజ్ బటన్ కచ్చితంగా నొక్కాలి, ఫామ్ 17సీ, 17ఏ, పీవో డైరీ సరి చూసుకోవాలన్నారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో ఏఆర్వోలు, ఏసీ రెవెన్యూ, సెక్టోరల్ అధికారులు, సంబంధిత అధికారులు ఉన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్, హాజరైన అధికారులు

రైతులకు ఇబ్బంది కలిగించవద్దు

- అకాల వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి
- కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి
- తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలి
- నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

ఈవీఎంల స్ట్రాంగ్ రూంకి సీల్ వేసిన కలెక్టర్, అధికారులు

నిర్మల్ టౌన్, మే 10 : రైతులకు ఇబ్బంది తలెత్తకుండా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వరి ధాన్యం కొనుగోళ్లు, అకాల వర్షంతో రైతులు నష్టపోకుండా తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతుల ధాన్యం తడిసిపోకుండా ఉండేందుకు సరిపడినన్ని టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతుల నుంచి ధాన్యాన్ని కొన్న వెంటనే మిల్లులకు తరలించాలని, లారీలను అదనంగా ఏర్పాటు చేయాలని సూచించారు. తగినన్ని సంచులను అందుబాటులో ఉంచాలని, రైతుల కోసం టెంట్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. ప్యాడీ క్లీనింగ్ యంత్రాల ద్వారా వరి ధాన్యాన్ని శుభ్రపరిచే విధంగా చూడాలని సూచించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో కేంద్రాలను పరిశీలించి రోజూ వారీగా రిపోర్టులను సమర్పించాలని, విధులపై నిర్లక్ష్యం చేస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, డీఎస్వో నందిత, డీఎం సివిల్ శ్రీకళ అధికారులు ఉన్నారు.

స్ట్రాంగ్ రూంల వద్ద నిఘా ఉంచాలి

ఈవీఎం స్ట్రాంగ్ రూంల వద్ద నిరంతరం పటిష్ట నిఘా ఉంచాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. శుక్రవారం వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్ట్రాంగ్ రూం నుంచి ఈవీఎంలను కలెక్టరేట్ సమీపంలోని గోదాంలోకి పోలీసు బందోబస్తు మధ్య తరలించారు. అనంతరం వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో ఈవీఎం గోదాంకు సీల్ వేశారు. ఈవీఎం స్ట్రాంగ్ రూంల వద్ద విధులు నిర్వర్తించే సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, ఎన్నికల పర్యవేక్షకుడు శ్రీనివాస్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కేటీఆర్‌పై రాళ్ల దాడి పిరికిపందల చర్య

- ఓటమి భయంతో బీజేపీ నాయకులే దాడి చేయించారు
- రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డిని ఎందుకు అడ్డుకోలేదు
- చిల్లర రాజకీయాలకు భయపడం
- మాజీ మంత్రి జోగు రామన్న, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

ఆదిలాబాద్, మే 10 (నమస్తే తెలంగాణ) : భైంసా ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై బీజేపీ నాయకులు హనుమాన్ భక్తులతో దాడి చేయించడం హేయమైన చర్య అని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ నాయకులు మతాల మధ్య చిచ్చుపెట్టి ఓట్లు దండుకునేందకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. నిజమైన హనుమాన్ భక్తులు ఇలాంటి చర్యలకు పాల్పడరని తెలిపారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పదేళ్లలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చేసిందేమీ లేదన్నారు. 'రాముడు అందరి దేవుడు..రాముడిని మొక్కుదాం..బీజేపీని తొక్కుదాం' అని అనడంలో తప్పేమీ ఉందన్నారు. బీజేపీ అభ్యర్థి గొడం నగేశ్ గతంలో భైంసా మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం అభ్యర్థికి ఓటు వేశారని గుర్తు చేశారు. గతంలో రాష్ట్ర మంత్రిగా, ఎంపీగా ఉన్న నగేశ్ గిరిజనుల కోసం చేసిందేమీ లేదన్నారు. ఎంపీ నిధులు ఖర్చు చేయకుండా దుర్వినియోగం చేశాడని ఆరోపించారు. బీజేపీ నేతలపై రేవంత్ రెడ్డి ఇష్టం వచ్చినట్లు మాట్లాడినా ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఇటీవల నిర్మల్‌లో పర్యటించిన రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డిని బీజేపీ నాయకులు ఎందుకు అడ్డుకోలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ చిల్లర వేషాలకు భయపడే ప్రసక్తి లేదని, తమ సహనాన్ని పరీక్షించవద్దని హెచ్చరించారు.

బీజేపీ ముసుగుదొంగ రేవంత్‌రెడ్డి

- బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు

బీజేపీ ముసుగువేసుకున్న దొంగ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని ఆయన పర్యటనలను బీజేపీ నాయకులు ఎందుకు అడ్డుకోవడం లేదని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు ప్రశ్నించారు. కేటీఆర్‌పై హనుమాన్ భక్తుల ముసుగులో దాడి చేయడం సరికాదన్నారు. అక్కడ తమ పార్టీకి చెందిన 10 వేల మంది కార్యకర్తలు ఉన్నారని అయినా తాము సంయమనం పాటించామన్నారు. బీఆర్ఎస్ సర్కారు హయాంలో ఇలాంటి ఘటనలు ఎక్కడా జరగలేదని తెలిపారు. ఎన్నికల్లో లబ్ధి కోసం ఇలాంటి చర్యలకు పాల్పడడం మానుకోవాలని సూచించారు. గతంలో మంత్రిగా, ఎంపీగా ఉన్న బీజేపీ అభ్యర్థి నగేశ్ జిల్లాకు చేసిందేమీ లేదని, ఆయనపై ప్రజలకు విశ్వాసం లేదని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జడ్పీటీసీ సుధాకర్, నాయకులు రోకండ్ల రమేశ్, మెట్టు ప్రహ్లాద్, భూమన్న, శ్రీనివాస్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మద్యం షాపులు బంద్

ఎదులాపురం, మే 10 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా శనివారం సాయంత్రం 5 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు జిల్లాలోని అన్ని మద్యం షాపులు మూసివేయాలని ఎక్సైజ్ సీఐ రేండ్ల విజేందర్ తెలిపారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు రోజు సైతం షాపులు మూసి ఉంచాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మూడు రోజుల పాటు జొన్నల కొనుగోళ్లు బంద్

ఎదులాపురం, మే10: జిల్లాలో వాతావరణ పరిస్థితులు, పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఈ నెల 11, 12, 13 తేదీ వరకు జొన్నల కొనుగోళ్లు తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు జిల్లా మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ప్రవీణ్ రెడ్డి తెలిపారు. 14వ తేదీ నుంచి కొనుగోళ్లు యధావిధిగా కొనసాగుతాయని తెలిపారు.

బోథ్ మార్కెట్ యార్డులో..

బోథ్, మే 10 : ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు జొన్నల కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు బోథ్ మార్కెట్ యార్డ్ సెంటర్ ఇన్‌చార్జి గోలి స్వామి తెలిపారు. రైతులు సహకరించాలని కోరారు.

పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేయాలి

- డబ్బు, మద్యం పంపిణీని అరికట్టాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్, హాజరైన కలెక్టర్ ,అధికారులు

నిర్మల్ టౌన్, మే 10 : పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేయాలని ఎన్నికల రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణ, పోలింగ్ కోసం ఏర్పాట్లపై అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో శుక్రవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. సీ విజిల్ యాప్‌లో, 1950 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదులు అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున వాటిని సకాలంలో పరిష్కరించాలన్నారు. అన్ని విభాగాల స్క్వాడ్ సిబ్బంది మరింత అప్రమత్తంగా పని చేయాలని సూచించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటనలకు మీడియా మానిటరింగ్ అండ్ సర్టిఫికేషన్ కమిటీ (ఎంసీఎంసీ) అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశించారు. ఓటర్లకు పోలింగ్‌పై అవగాహన పెంచేందుకు నమూనా పోలింగ్ కేంద్రాలు (మోడల్ పోలింగ్ కేంద్రాలు) ఏర్పాటు చేయాలన్నారు. నిర్దేశించిన మార్గాల్లో మాత్రమే రూట్ ఆఫీసర్ల సమక్షంలో ఈవీఎం యంత్రాలను తరలించాలని సూచించారు. ఓటర్ స్లిప్పుల పంపిణీ ప్రక్రియ దాదాపు పూర్తయిందన్నారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పోలింగ్ సామగ్రి తరలింపులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డబ్బు, మద్యం పంపిణీని అరికట్టాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రానికి పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల సౌకర్యార్థం టెంట్లు, ఫ్యాన్లు, తాగునీరు, విద్యుత్, అత్యవసర మందులు, వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ శాతానికి సంబంధించిన రిపోర్టులను సమయానికి పంపాలని, అన్ని కేంద్రాల్లో వంద శాతం వెబ్ కాస్టింగ్ చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. నోడల్ అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఆర్వో భుజంగ్‌రావు, ఆర్డీవో రత్నాకల్యాణి, డీఈవో రవీందర్ రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, డీపీఆర్వో విష్ణువర్ధన్, డీపీవో శ్రీనివాస్, జిల్లా నోడల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఫ్లాగ్‌మార్చ్

ఎదులాపురం, మే 10 : ఆదిలాబాద్ పట్టణంలో శుక్రవారం పలు ప్రధాన కూడళ్లలో పోలీసులు, కేంద్ర బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ప్రజలకు పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ కే సత్యనారాయణ, పోలీసులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల రక్షణకే పోలీసులు

ఉట్నూర్, మే 10 : శాంతిభద్రతల రక్షణ కోసమే పోలీసులు ఉన్నారని జిల్లా ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. ఉట్నూర్ డీఎస్పీ నగేందర్‌గౌడ్‌తో కలిసి పోలీసులతో కవాతులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మొగిళి, ఎస్ఐ మనోహర్, సాయుధ దళాల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

పోలింగ్ రోజున వేతనంతో కూడిన సెలవు

ఎదులాపురం, మే 10 : ఈ నెల 13న ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఓటర్లకు వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రభుత్వం ప్రకటించిందని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. పోలింగ్ సందర్భంగా అన్ని ప్రభుత్వ ,ప్రభుత్వేతర సంస్థలు, పరిశ్రమలకు వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించినట్లు తెలిపారు.

13 రకాల కార్డుల్లో ఏదైనా ఒకటి తెచ్చుకోవాలి

ఈ నెల 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేసేందుకు వచ్చేటప్పుడు తమ వెంట 13 రకాల కార్డుల్లో ఏదైనా ఒకటి తమ వెంట తెచ్చుకోవాలని పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి రాజర్షి షా తెలిపారు. ఓటర్, ఆధార్, ఎంఎన్ఆర్ఈజీఎస్ జాబ్‌కార్డు, ఫొటోతో ఉన్న పోస్టాఫీస్, కార్మిక మంత్రిత్వశాఖ ఇచ్చిన హెల్త్ ఇన్సురెన్స్‌స్మార్ట్ కార్డు, డ్రైవింగ్‌లైసెన్స్, పాన్‌కార్డ్, లేబర్ గుర్తింపుకార్డు, పాస్‌పోర్ట్, ఫొటోతో ఉన్న పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ గుర్తింపు కార్డు, ఎంపీ, ఎమ్మెల్యే ,ఎమ్మెల్సీలు ఇచ్చిన అధికారిక గుర్తింపుకార్డు, దివ్యాంగుల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి ఉండాలన్నారు.

అకాల వర్షం..అన్నదాతకు నష్టం

పెంబి, మే 10: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం అకాల వర్షానికి పంట కల్లాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన మొక్కజొన్న, ధాన్యం తడిసింది. ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు కప్పినప్పటికీ తడవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిసిన ధాన్యాన్ని ఎలాంటి కొతలు విధించకుండా మద్దతు ధరకు కొనాలని రైతులు వేడుకుంటున్నారు.

ఉట్నూర్ మండలంలో..

ఉట్నూర్ రూరల్, మే 10 : ఉట్నూర్ మండలంలో శుక్రవారం ఈదురుగాలులతో వర్షం కురిసింది. కోత కోయడానికి సిద్ధంగా ఉన్న వరి పంట నేలకొరిగింది. కొనుగోలు కేంద్రంలో వడ్లను తడవకుండా టార్పలిన్ కవర్లతో కాపాడారు. చేతికచ్చిన పంట వర్షానికి తడిసి నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉట్నూర్ రూరల్ : నేలకొరిగిన వరి పంట